# ఒక గ్రంథాలయం - ఒక మిస్

ఒక ఆరో తరగతి అమ్మాయి గ్రామంలోని జడ్.పి.హెచ్ స్కూల్లో 170 మంది పిల్లలందరిలోనూ ప్రతిభను అనేక విధాలుగా చూపించడమే కాక వివేకాన్ని, విజ్ఞానాన్ని వ్యక్తపరచడంలో ముందు ఉంది. అందరిలోనూ ఇంత ప్రతిభ కనపబరచడానికి కారణం *జీవిత చరిత్ర గ్రంథాలయానికి* రోజు రావటమేనని అందరి ముందు చెప్పిందంటే తన వ్యక్తిత్వాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుకుందో ఊహించవచ్చు. ఆ విషయాన్ని స్కూల్ హెచ్.ఎమ్. గారు కూడా స్కూల్ వార్షికోత్సవం రోజున అందరికి చెప్పారు. ఇది *జీవిత చరిత్ర గ్రంథాలయ* ప్రభావానికి ఒక ఉదాహరణ.

ఆమెకి మేము ఈరోజు ఇస్తున్న పేరు *మిస్ నాకు - నేనే.* ఆమె ఈ *జీవిత చరిత్ర గ్రంథాలయ* ప్రారంభమైనప్పటి నుంచి వస్తుంది. అప్పుడు ఆ అమాయక పాప మూడోతరగతి చదువుతుంది. తల్లిదండ్రులు ఇద్దరు వ్యవసాయ కూలీలనే చెప్పవచ్చు. స్వయంకృషితోనే వాళ్ళ జీవన విధానం. ఇద్దరి విద్య 5-10 క్లాస్ వరకే. వారికి ఈ *మిస్ నాకు-నేనే* పెద్ద అమ్మాయి. తల్లి కొద్దో గొప్పో అమ్మాయి భవిష్యత్తు మీద, విద్య మీద కొంత ధ్యాస ఉంది. తండ్రికి టైం ఉన్నట్టు కనబడదు. అయితే ఈ *జీవిత చరిత్ర గ్రంథాలయాన్ని* చూసే కఠారి సంధ్య రోజు వచ్చే దారిలో చెరువు గట్టు మీద పాకలో ఉండే తల్లికి సంధ్యతో కొంత పరిచయం ఉండడం కలిసి వచ్చింది.

అంటే ఇప్పటి వరకు *మిస్ నాకు-నేనే* మూడో తరగతి నుంచి ఆరో తరగతి వరకు స్కూల్ అవ్వగానే 4:30 తర్వాత ఈ *జీవిత చరిత్ర గ్రంథాలయానికి* వచ్చి ఉన్న సదుపాయాన్ని వినియోగించుకోవడమేగాక, ఇతర పిల్లలతో కలిసిమెలిసి ఆడుకోవడం, చదువుకోవడం, ఆలోచించడంగా దైనందిన కార్యక్రమాలుగా మారింది. చదివిన దాని గురించి చెప్పడం తెలుసుకోవడంలో, చురుకుదనంలో ప్రత్యేకత చూపించడంలో *మిస్ నాకు నేనే* కి సహజంగానే నలుగురుతో మంచిగా మెలగాలనే ప్రవృత్తి, తోడ్పడే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ఉపయోగపడింది. అట్లాంటి స్వభావాలను *జీవిత చరిత్ర గ్రంథాలయం* నుంచి చదివి తెలుసుకోవడంలోనే ఉంది రహస్యం.

*మిస్ నాకు నేనే* కి ప్రతిచోట మంచి అనుభవమే. పరిస్థితులు ఎదుర్కొనే విధానంలో నుంచే కదా మంచి పద్ధతులు, అలవాట్లు వచ్చేది. తన సొంత సేవింగ్ అకౌంట్ మెయిన్‌టైన్ దగ్గర నుంచి, ఇదే తీరు ముందు ముందు సంవత్సరాలలో తనను తాను తమాయించుకుని దిద్దుకోగలిగితే ఒక కొత్త ప్రపంచాన్ని చూడగలదు. మంచి ఆదర్శం, మార్గదర్శకురాలిగా ఎదగగలదు. అదేగా తల్లిదండ్రులు కోరుకునేది. *జీవిత చరిత్రల గ్రంథాలయం* ఈమె 4 సంవత్సరాల ఎదుగుదలని తీర్చిదిద్ది ప్రోత్సహించడమేకాక, అదేసమయంలో సంధ్య స్నేహం కూడా బాగా ఉపయోగపడింది. ఇదే మార్గం ఎంతోమందికి కల్పించవలసిన బాధ్యత, కొత్త కొత్త ఆలోచనలని రేకెత్తించే విధంగా ప్రక్కన నలుగురికి సహచరులకు కూడా తోడ్పడాలనే ఆలోచన తనకు తానే ఏర్పర్చుకుంది.

సమాజం, సమస్యల అవగాహనే కాకుండా వాటిని పరిష్కరించే విధానాలు, ఈ 11 సంవత్సరాలకే మనసులో లాయర్‌ను అయితే నలుగురికి ఉపయోగపడతాననే ఆలోచన ఏర్పడటం అద్భుతం. జీవిత చరిత్రలు ఉద్దేశ్యం ధన్యం అయినట్టే. ఇట్లాంటి వాళ్ళని నలుగురిని తయారు చేయగలిగితే గ్రంథాలయమే కాదు, విద్యాలయం అని కూడా చెప్పవచ్చు.

చిన్నప్పుడే జీవిత చరిత్ర గ్రంథాలు చదవటం అంటే చీకట్లోంచి వెలుతురులోకి ప్రయాణించడమే. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని, ఆలోచన విధానాన్ని తీర్చిదిద్దుకోవడమే, తన భవిష్యత్తును తానే

నిర్ణయించుకోవటం వీటన్నిటికీ ఉదాహరణలు. ఇక్కడ ఈ మిస్‌ని ప్రస్ఫుటంగా చూడవచ్చు. ఇందుకు ఆవిడ తల్లిదండ్రులని, నాయనమ్మని కూడా అభినందించాలి. వాళ్లంతా ఈ పిల్లలకి కావాల్సిన మనోధైర్యం, అవకాశాన్ని ఇచ్చి ప్రోత్సహించారు. అలాగే ఆమె హైస్కూల్లో ఉపాధ్యాయులు కూడా ఎంతో తోడ్పాటు అందజేసారు.

మొదటి సంవత్సరం 2022లో *మిస్* నాకు నేనే ఒంటరిగా *జీవిత చరిత్ర గ్రంథాలయా*నికి వచ్చింది. ఎప్పుడైతే డొక్కా సీతమ్మ పాత్రను నేర్చుకొని కాకినాడ బాలోత్సవానికి వెళ్లి అక్కడ వాళ్ళ ప్రశంసలు అందుకుందో, అప్పటినుంచి ఒక కొత్త ఉత్సాహం మొదలైంది అని చెప్పవచ్చు. కొత్త జీవిత చరిత్ర చదివి పాత్రాభినయం చేయటంలో కుతూహలత అప్పటినుంచి కొత్త కాంతి ప్రవేశించినదా అనేవిధంగా *మిస్* నాకు నేనే మారింది, స్కూల్లో కూడా తన క్లాసులో ప్రతిభని ప్రతి పరీక్షలో ప్రత్యేకత చూపించటం మొదలయ్యింది.

అదేవిధంగా తల్లిదండ్రులు ఆమెలో ఇంతకుముందు కన్నా మంచి మార్పులే కాక ఉత్సాహం పెరగటం గమనించారు. మార్పు ఇంట్లో, స్కూల్లో, గ్రంథాలయంలో కొట్టొచ్చినట్టు కనబడుతుంది. నాలుగు సంవత్సరాల తర్వాత అదే అమ్మాయి ఆత్మవిశ్వాసం, నిర్భయత, నేర్పరితనంతోపాటు ఇప్పుడు నలుగురు స్నేహితుల నుంచి సలహా కోసం ఎదురు చూడకుండా ఉండే పరిస్థితి పెరిగింది. తనంతట తానే ఆత్మవిశ్వాసంతో పదిమందికి పైగా ఆదర్శంగా ఉంది. వ్యక్తి వికాసంతో పాటు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడమే కర్తవ్యం. అదే *జీవితచరిత్ర గ్రంథాలయ* ఉద్దేశ్యం కూడా.

***- డా. ఎన్. భాస్కరరావు***

# మేకింగ్ ఆఫ్ ఎ లీడర్

శ్రీదేవినేని మధుసూదన్ గారికి,

మీరు పంపిన పైన చెప్పిన మకుటం టైటిల్ గల పుస్తకం శ్రీ డా. నాగులపల్లి భాస్కరరావు గారు రచించినది చదివేను. సంభ్రమము, ఆశ్చర్యము కలిగాయి. కళ్లు రెండూ పెద్దవి చేసుకొని మళ్లీ మళ్లీ చదివేను.
శ్రీ భాస్కర రావు గారితో తొలిసారి పరిచయం, వారి వ్యాసం ప్రైమ్ పోస్ట్ ఫిబ్రవరి 11వ తేదీ 2021 సం.లో మొబైల్ న్యూస్‌లో చూసేను. ఆ వ్యాసాన్ని తెలుగులోకి అనువదించాలనే కోరిక కలిగింది. మీ ద్వారా వారి పర్మిషన్ తీసికొన్నాము. అది గాంధీజయంతి సందర్భంలో ఆంధ్రప్రభలో *గాంధీయం ఓ గాండీవం* అను శీర్షిక ధారావాహికంగా ప్రముఖ జర్నలిస్టు నాగసూరి వేణుగోపాల్ గారు నిర్వహించిన దానిలో *గాంధీబాట* కానరాదిచట అనే మకుటంతో ప్రచురింపబడినది. అశేష జనుల అభినందనలు పొందినది.
భాస్కరరావు గారి స్వగ్రామం ముదునూరు. *జననీ జన్మభూమిశ్చ, స్వర్గా దపి గరీయసి* అన్న ఆర్యోక్తి ప్రకారం వారు ఢిల్లీలో కీలక వ్యక్తిగా నిరంతరం పనులతో వుండి కూడ తన స్వంత ఊరికి చేసిన, చేస్తున్న సేవ, నిర్వహిస్తున్న కార్యకలాపాలు ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తాయి. అవి అందరికీ ఆదర్శప్రాయము. ముఖ్యంగా ఈ పుస్తకంలో చంద్రబాబుకు *విజన్ 2020,* కంప్యూటర్ ఉపయోగము, తిరుపతి అభివృద్ధి, హెరిటేజ్ పాల వ్యవస్థ నెలకొల్పుట, వంటి అనేక అంశాలపై సలహాలిచ్చి, ప్రోత్సహించిన మార్గదర్శి భాస్కరరావుగారు. *కర్మణ్యే వాధి కారస్య మాఫలేషు కదాచన* అని భగవద్గీతలో చెప్పేరు తన పేరు ఎక్కడా ప్రకటించుకోలేదు! అది చూసి వారికి శిరస్సు వంచి ప్రణామము చేస్తున్నాను. పుస్తకం ఆద్యంతం ఆశ్చర్యపరచినది. ఇంతకూ దార్శనికతకు, భవిష్యత్ పథకాలను నెలకొల్పుటకు ఆద్యుడు ఎన్.టి.ఆర్ అనే విషయం మరో విశేషం. ఎన్.టి.ఆర్ ప్రజల మనిషి. ప్రజాసేవకు మంచి పనులకు ఆయన పరిపాలన వరవడి దిద్దింది. ఈ విషయం దేశవ్యాప్తంగా అందరికీ తెలుసును. ఎన్నో కార్యక్రమాలను ఇతర రాష్ట్రముల వారు, నేడు కేంద్ర ప్రభుత్వంలో మోడీగారు అనుసరిస్తున్న విషయం కూడా, వారిద్వారా విని మరింత ఆనందము కలిగినది.
*ఒక రాజకీయ నాయకునిగా ఎదగాలంటే ఏవిధమైన ప్రత్యేకతలు సమకూర్చుకోవాలి అనేది* ముఖ్యం అన్నారు వారు. ఇందుకు చంద్రబాబు ఉదాహరణ అన్నారు. నీలం సంజీవ రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, చంద్రబాబు కలిసి

ఢిల్లీకి వెళ్లి, భాస్కరరావు గారిని కలిసారు. మేము కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పేరు.
ఎన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీ నెలకొల్పగానే అందులోకి ఎన్.టి.ఆర్‌తో కలిసి పనిచేయడానికి ప్రోత్సహించిన దార్శనికుడు భాస్కరరావు గారు.
కొత్త ఆలోచనలు వినటము, విషయాలు సూక్ష్మంగా గ్రహించడము, చంద్రబాబులో చూసి, అతడిని స్వంత లాభం లేని వ్యక్తిగా వీరు గుర్తించేరు. ఎన్ని విమర్శలు వచ్చినా, తన ముఖంలో హావభావాలు చూపించలేదని, ఏవిధమైన కోపతాపాలకు తావు ఇవ్వలేదని పేర్కొన్నారు. *హిజ్ టోలరెన్స్ లెవెన్ ఇన్ పాలిటిక్స్ ఈజ్ అన్‌పారలెల్డ్* అని కూడా చెప్పారు.
తిరుపతిలో 1982లో హొటల్ పెట్టిన చంద్రబాబు ఇండియన్ ఎయిర్ లైన్స్ విమాన సంస్థ అక్కడకు రావడానికి కారకుడయ్యేడన్నారు. చెన్నై నుండి వచ్చి వెళ్లుట కష్టం, దేశవ్యాప్తంగా శ్రీ తిరుమల శ్రీనివాసుని దర్శించుకునే భక్తులకు తిరుపతికి దగ్గరగా యీ ఎయిర్‌పోర్ట్ వుంటే సులభతరమవుతుందని అభిప్రాయం.
ఈ విషయంలో భాస్కరరావు గారి సహాయం అద్భుతం. సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ తయారు చేయుటలో సలహాలు ఇచ్చారు. ఎయిర్ లైన్స్ కనెక్టివిటీతో అశేషమైన సౌకర్యం అందరికీ లభించింది.
చంద్రబాబుకు కంప్యూటర్ ఉపయోగం సూచించిన వారు భాస్కరరావు గారు. కారణం ఎన్.టి.ఆర్ అతనికి పార్టీ కార్యాలయం బాధ్యతలు అప్పగించుట, అందుకు వారు ఏవిధంగా అతనికి సహాయపడినదీ తెలిసికొని ఆశ్చర్యం కలిగింది.
ఆర్థిక మంత్రిగా చంద్రబాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ట్రయల్స్ వేస్తున్నప్పుడు, సుదీర్ఘమైన ఉపన్యాసం చాల మందికి విసుగు కలిగిస్తుందని, ప్లాస్టిక్ షీట్‌పై ముఖ్యాంశాలు క్రోడీకరించి, ఓవర్ హెడ్ ప్రొజెక్టర్ ద్వారా ప్రెజెంట్ చేయడం అనే విషయం భాస్కరరావు గారి సృజనాత్మకత (క్రియేటివిటి)కి మచ్చుతునక.
విజన్ 2020 ఆలోచన మూలాలు ఎలా వచ్చాయి, అన్న అంశంలో భాస్కరరావుగారి ఇండియా 21 అని వారు 1986లో వ్రాసిన పుస్తకం చంద్రబాబుకు స్ఫూర్తినిచ్చింది. కర్షక పరిషత్ అను సంస్థను ఎన్.టి.ఆర్ ప్రారంభించి, ఆ బాధ్యతను అతనికి అప్పగించారు. ఇది ఒక హైలైట్ ఆ వ్యవస్థ ద్వారా రైతులకు, రైతు కుటుంబాలకు, ఇదికాక గ్రామీణ సౌభాగ్యానికి కార్యక్రమాల రూపకల్పన జరిగింది. మహిళా సహకార పాల సంఘాలు ఏర్పాటయ్యేయి. ఇవన్నీ నెమ్మదిగా నేడు బహుళ ప్రచారంలో వుండి ప్రభుత్వాలు అమలుచేస్తూన్న డ్వాక్రా గ్రూప్‌కు నాంది. ఇవన్నీ దేశంలో మొట్టమొదట ఎన్.టి.ఆర్ ప్రవేశపెట్టినవి.
జన్మభూమి కార్యక్రమాన్ని తొలిసారిగా సౌత్ కొరియా నుండి అధ్యయనం చేసి, మన రాష్ట్రంలో అమలు పరచుట అద్భుతం. ఇది తరువాతి కాలంలో ఎందరో ప్రవాసాంధ్రులు వారి మూలాలకు వెళ్లి, వారి
స్వంత ఊరు అభివృద్ధి చెందడంకోసం, పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు-హాస్పటల్స్, పాఠశాలలు, మంచినీరు, మరుగు దొడ్లు, ఆరోగ్య పరిరక్షణ-చక్కని రోడ్లు-ఇలాంటి ఎన్నో చర్యలకు శ్రీకారం చుట్టింది. నేడు ఎమ్.ఎల్.ఎ, ఎమ్.పిలకు కొన్ని నిధులు కేటాయించారు. వారుకూడ తమ నియోజక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. క్రీడాకారులు, సినీనటులు కూడా ఈ విషయంలో ముందడుగు వేస్తున్నారు.
తమిళనాట రజనీకాంత్, మన రాష్ట్రంలో చిరంజీవి, మహేష్‌బాబు, వంటి నటులు, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి ప్రసిద్ధ ఆటగాళ్లు కూడా తమవంతు కృషి చేస్తున్నారు కదా.
ఇక మరో ముఖ్య అంశం. రైతు బజార్లు అమెరికాలో నేను ఫార్మర్స్ మార్కెట్ అని చూసాను. ఎన్నోసార్లు అక్కడ వస్తు సముదాయం సరసమైన ధరలకు దొరికేవి, కొన్నాము. ఆంధ్ర, తెలంగాణాలలో ఈ రైతు బజార్లు అన్ని నగరాల్లో, పట్టణాలలో ఏర్పాటుచేసి, కూరగాయలు, ఆకుకూరలు వినియోగదారులకు సరసమైన ధరలకు లభించే ఏర్పాటు జరుగుట అద్భుతం. ఇందువల్ల పండించిన రైతులు కూడా దళారీల బెడద తప్పి తమ పంటకు కిట్టుబాటు ధరలు పొందుతున్నారు. ఉభయ తారకమిది.
ఇక మరో అంశం టైమ్ మేనేజ్‌మెంట్ రోజుకు 24 గంటలే వుంటాయి కదా! అది వినియోగించుకోవడంలోనే మనిషి శక్తి, తెలివి, బయటకు వచ్చి విజయాలనిస్తాయి.
మా పిల్లల బాల్యంలో వారికి నేనొక ఉదాహరణ చెప్పేదానిని. ఒక చక్కని డబ్బా చూపించి, పిల్లలూ,
ఈ డబ్బాను ఎన్నో రకాల వస్తువులతో నింపవచ్చు. మన్ను, ఊక, రాళ్లు, బియ్యం, పప్పులు – కాని బంగారంతో

నింపితే దాని విలువ వేరుకదా. దేవుడు అందరికీ మెదడు ఇచ్చాడు. ఉపయోగించినవారు బాగుపడి, వృద్ధిలోకి వస్తారు. కాలం విలువ తెలుసుకొని బ్రతకాలి. ఎవ్విరి మినిట్ వేస్టెడ్–ఈజ్ వేస్టెడ్ ఫర్ ఎవర్ అని చెప్పి వారు చదువుకునే ప్రదేశంలో ఒక కాగితంపై ఆ స్లోగన్ వ్రాసి గోడకు అంటించడం బాగా గుర్తు.

*విజన్ 2020 మన దేశంలోనే మొదటి ప్రయత్నం* అన్నారు. ముందు చూపుతో రేపటి గురించి ఈరోజే ఏమి చేయాలో నిర్ణయాలు తీసికొనడంలో చొరవ చూపడం–అదే విజన్ 2020. చంద్రబాబు ప్రత్యేకతను చెపుతూ, ఒక మంచి ఆలోచనను వెంటనే గ్రహించి, దాన్ని ఉద్యోగులతోనూ, అధికారులతోనూ చర్చించి, అందరిని కార్యోన్ముఖులు చేయడం–అని మెచ్చుకున్నారు భాస్కరరావు గారు. ఈ సందర్భంలోనే కేవలం దేశీయ పెట్టుబడులతో రాష్ట్రాభివృద్ధి జరగడం కష్టమని గ్రహించిన చంద్రబాబు ఫారిన్ ఇన్వెస్టిమెంట్ వైపు. అందుకు అమెరికన్ దిగ్గజం బిల్‌గేట్స్ వగైరాలను హైదరాబాదుకు రప్పించారు. ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీకి పునాదులు అప్పుడే. ఇన్ఫోసిస్ వంటి కంపెనీ అధినేత నారాయణమూర్తి గారిని ఆహ్వానించి తమరికి ఏమి సదుపాయాలు ఇవ్వగలను? తమ కంపెనీ బ్రాంచి తెరవడానికి అని కోరి ఐ.టి.హబ్‌గా మార్చారు. ఆ విధంగా హైదరాబాదును హైటెక్‌సిటీగా విజన్ 2020 గురించి చెప్తూ ఆలోచన తమదే, అయినా దాన్ని ముందుకు తీసుకొని వెళ్ళి ఆచరణలో పెట్టిన క్రెడిట్ చంద్రబాబుకు ఇచ్చారు భాస్కరరావు గారు.

ప్రజల వద్దకు పాలన ఎన్.టి.ఆర్. స్ఫూర్తితో అలవర్చుకొన్నది. అచిరకాలంలో ఇతర రాష్ట్రాలు (ఉదా. రాజస్థాన్) అనుసరించినట్లు చెప్పారు. చంద్రబాబు మరో ప్రత్యేకత ఆత్మ విమర్శ, అది ప్రతి రాజకీయ నాయకునికి అవసరం అన్నారు. అయినా అతని నిబద్ధతకు, నిజాయితీకి, తప్పక ప్రజలు వచ్చే 2024 ఎన్నికలలో ఓట్లు వేసి గెలిపిస్తారని అది రాష్ట్ర ప్రజలకే మేలు జరిగే విషయంగా డా. భాస్కరరావు గారు చెప్పారు. ఇది వారి విశాల హృదయాన్ని ఆవిష్కరిస్తున్నది. కొద్దికాలం క్రితం డా. పెద్ది రామారావు గారు రచించిన *డి కోడింగ్ ద లీడర్* పుస్తకాన్ని చదివాను. అందులో చంద్రబాబు విజన్ గురించి, ఇతర అంశాల గురించి విశేషంగా ఆకట్టుకునే అంశాలు ఎన్నో తెలియపరచారు.


*ఈనాడు* ఆధ్వర్యంలో ఆ పుస్తకావిష్కరణ సభ భారీ ఎత్తున జరిగింది. ఇంకా కొన్ని పుస్తకాలు చంద్రబాబు విజన్ గురించి, గొప్ప నిబద్ధత గల నాయకుడనీ – వ్రాసినవి వచ్చాయి.

ముగింపులో ఒక్కమాట భాస్కరరావు గారు ఇదే నా చివరి పుస్తకం అన్నారు. వారికి నా మనవి. దయచేసి అలాంటి నిర్ణయం తీసుకొనవద్దు. మీరు వ్రాస్తూ ఉండాలి. మాలాంటి వాళ్లకు అనేక విషయాలు ఎలా తెలుస్తాయి? అయ్యా వ్రాస్తూ వుండండి.


**- కాళ్లకూరి శేషమ్మ**

## మిసిమి మిత్రులకు ఉగాది పురస్కారం





**వలేటి గోపీచంద్**
ఆకాశవాణి



**కోన రమణారావు**
చీరాల